క్లుప్తంగా

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు నూతక్కి విద్యార్థులు ఎంపిక



మంగళగిరి: కృష్ణా జిల్లా నలంద నికేతన్ ఆవరణలో ఈనెల 14,15 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్– 15 ఫుట్‌బాల్ పోటీల్లో నూతక్కిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ కె రజనినాయక్ తెలిపారు. పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు శావ ప్రభాకర్, జానాల భరత్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కాగా మంగళవారం పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.

నేడు నృసింహుని పానక విక్రయ హక్కులకు వేలం

మంగళగిరి: నగరంలోని శ్రీలక్ష్మీ నృసింహ స్వామి ఎగువ సన్నిధిలో వేంచేసియున్న పానకాల లక్ష్మీ నృసింహస్వామి పానక విక్రయ హక్కులకు బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు దేవస్థాన ఈఓ ఎ రామకోటిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పానకం విక్రయ హక్కుల వేలం పాటలో పాల్గొనదలచిన వారు సీల్డు టెండర్ కం బహిరంగ వేలం విధానంలో పాల్గొనాలని కోరారు.

కల్వర్టు నిర్మాణం పూర్తి



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలో సీఎండీఎఫ్, మండల పరిషత్ నిధులతో నిర్మించిన బాక్స్ కల్వర్టు నిర్మాణం మంగళవారానికి పూర్తయింది. గతంలో ఉన్న తూము కృంగిపోయి వర్షాలు పడినపుడు మురుగు పొల్లాలో నిలబడి పంటలు నష్టపోతున్నామని స్థానిక రైతులు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన తన సొంత ఖర్చులతో ముంపునీరు వెళ్లేలా ఏర్పాటు చేయించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి సీఎండీఎఫ్, మండల పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించి బాక్స్ కల్వర్ట్ నిర్మాణ పనులు ప్రారంభించేలా చొరవ చూపించారు. బాక్స్ కల్వర్ట్ నిర్మాణం పూర్తికావడంతో చింతలపూడి గ్రామస్తులు, రైతులు ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు.

లూథరన్ ఆలయంలో స్త్రీల మహాసభ వేడుకలు

తాడికొండ: తాడికొండ మండలం మోతడక గ్రామంలోని పరిశుద్ధ పౌలు లూథరన్ దేవాలయంలో స్త్రీల మహాసభ ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం భక్తులకు ప్యారీష్ పాస్టరమ్మ వీర్నపు /ాన్సీరాణి వాక్యోపదేశం చేశారు.

అంత్యక్రియలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పేరుకలపూడి గ్రామానికి చెందిన యలవర్తి మల్లేశ్వరరావు, జి.కృష్ణకుమారి అనారోగ్యంతో మృతి చెందిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. సర్పంచ్ గంపల గంగాధర్ చేతుల మీదుగా మంగళవారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నూతలపాటి కేశవరావు, నల్లగొర్ల నాగేశ్వరరావు, ఆళ్ల మహేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్ భర్తకు టోకరా

మంగళగిరి: మహిళా పోలీస్ కానిస్టేబుల్ భర్తకు సైబర్ నేరగాడు టోకరా వేసిన ఘటన చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మంగళగిరి మార్కండేయ కాలనీకి చెందిన దివి నాగరాజు విజయవాడ నగరంలోని ఓ బంగారం షాపులో గుమస్తాగా పని చేస్తుంటాడు. నాగరాజు భార్య తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో నాగరాజుకు కొద్ది రోజుల కిందట ఫోన్‌లో షాపీ స్టోర్ అనే యాప్‌లో పలు వస్తువుల కొనుగోళ్లు-అమ్మకాల ద్వారా పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ లక్షలు సంపాదించుకోవచ్చని ఓ లింకు వచ్చింది. నాగరాజు తొలుత లింకు ఓపెన్ చేసి రూ.వెయ్యి చెల్లించగా రూ.1200 జమ అయ్యాయి. వెంటనే మళ్లీ రూ.1200 చెల్లించగా రూ.2400 జమ అయ్యాయి. ఇలా రెండు మూడు మార్లు జమ కావడంతో ఆశపడ్డ నాగరాజు అధిక మొత్తం చెల్లిస్తూ తొమ్మిది దఫాలుగా రూ.1,67,510 చెల్లించాడు. వాటికి తిరిగి నగదు జమ కాకపోవడంతో సదరు యాప్‌లో ఉన్న ఫోన్‌కు ఫోన్ చేయగా మరో రూ.5లక్షలు చెల్లిస్తే మొత్తం కలిపి జమ చేస్తామని తిరుగు సమాధానం వచ్చింది. మోసపోయానని తెలుసుకుని సోమవారం పట్టణ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా ఐటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యం



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ శ్రావణ్‌బాబు, డీపీఎంఓ డాక్టర్ రత్నమన్మోహన్ తదితరులు



పరిశీలించి సూచనలిస్తున్న ఎంపీడీఓ డి.అనూరాధ

- జిల్లాలో విస్తృతంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ శ్రావణ్‌బాబు

మంగళగిరి: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని డీఎంహెచ్‌ఓ ఎ శ్రావణ్‌బాబు అన్నారు. నగరంలోని గణపతినగర్‌లో ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేపై హెల్త్ సెంటర్ల మెడికల్ అధికారులు, ఏఎన్‌ఎంలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ప్రతి ఇంటికి వెళ్లి తప్పనిసరిగా నాణ్యతతో చేయాలన్నారు. ప్రతి కుటుంబంలో అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి హెల్త్ క్యాంపులకు తరలించి ప్రత్యేక డాక్టర్లచే పరీక్షలు నిర్వహించి వైద్యం అందించాలన్నారు. ఏఎన్‌ఎంలు, హెల్త్ సెంటర్ల సిబ్బందితో పాటు ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాల నుంచి 50 మంది మెడికల్ విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. మెడికల్ అధికారులు ప్రతిరోజూ సర్వేపై మానటరింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. క్యాంపు నిర్ణయించిన తేదీకి ప్రతి ఇంటికి సర్వే బృందం వెళ్లి సర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం ఇందిరానగర్‌లో జరుగుతున్న ఇంటింటి సర్వేను డీఎంహెచ్‌ఓ శ్రావణ్‌బాబు పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ రత్న మన్మోహన్, హెల్త్ సెంటర్ల మెడికల్ అధికారులు పి అనూష, రమేష్, కిరణ్, షేక్ మొబీనా, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

ఫిరంగిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందించే ఉచిత వైద్యం పేదలపాలిట వరం వంటిదని ఎంపీడీఓ డి.అనూరాధ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీకాలనీ, శాంతిపేటలో ఫిరంగిపురం సెక్టార్ ఆరోగ్య సిబ్బందితో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది రెండు టీంలుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి ఇంటిలోని వారి అనారోగ్య సమస్యలు అడిగి తెలుసుకొని వాటిని యాప్‌లో అప్‌లోడు చేసి టోకెన్లు అందజేశారు. ఇంటింటి సర్వేను ఎంపీడీఓ దాసరి అనూరాధ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటిని వదలకుండా సర్వే నిర్వహించాలని ఇంటిలోని వారి అనారోగ్య సమస్యలు తెలుసుకొని వాటిని అప్‌లోడు చేయాలని చెప్పారు. అంతేకాకుండా అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల అనారోగ్య సమస్యలు తెలుసుకొని అవసరమైన వారికి శిబిరానికి వచ్చేలా టోకెన్లు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టారు వైద్యాధికారి పి.ఎ స్తేరురాణి, సీహెచ్‌వో వెంకటరమణ, పీహెచ్‌ఎస్ గాయత్రీదేవి, ఏఎన్‌ఎంలు భారతీజ్యోతి, మాబు, లావణ్య, అరుణ, ఆంతోనిరాణి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

తాపీ ధర్మారావు చిరస్మరణీయుడు



తాపీ ధర్మారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తెనాలి: ప్రజల భాషను అన్నిరంగాల్లో వ్యాప్తి చేయాలనే ధ్యేయంతో జీవితాంతం కృషి చేసిన తాపీ ధర్మారావు చిరస్మరణీయులని సాహితీ ప్రముఖుడు బి.లలితానంద ప్రసాద్ అన్నారు. పట్టణ గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' కార్యాలయంలో అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణలో మంగళవారం సాయంత్రం తాపీ ధర్మారావు జయంతిని జరిపారు. ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు అధ్యక్షత వహించారు. అభ్యుదయ రచయితల సంఘం మూలస్తంభాల్లో ఒకరైన తాపీ ధర్మారావు ప్రజల సాహిత్యానికి విశేష ప్రాచుర్యం కల్పించారని చెప్పారు. ప్రజల భాషను సినిమా రంగానికి కూడా తీసుకెళ్లారని చెప్పారు. అభ్యుదయ రచయితల సంఘం ప్రథమ మహాసభలు తెనాలిలో జరిగినపుడు ధర్మారావు అధ్యక్షత వహించినట్టు లలితానంద ప్రసాద్ గుర్తుచేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత, కవి అయినాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ పాత్రికేయునిగా, రచయితగా, పరిశోధకుడిగా, సినిమా సంభాషణల రచయితగా, జీవితాంతం కమ్యూనిస్టుగా మెలిగిన తాపీ ధర్మారావు జీవిత విశేషాలను వివరించారు. సభలో ఇస్కఫ్ నాయకులు పి.నారాయణరావు, బొల్లిముంత కృష్ణ, వెనిగళ్ల ప్రసాద్, ఎంపీ రఘునాధరావు, పరుచూరి వెంకటేశ్వరరావు, విజయదుర్గ, కవి ఆళ్ల నాగేశ్వరరావు, వంగా సుదర్శనరెడ్డి, అంబటి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు. తొలుత తాపీ ధర్మారావు చిత్రపటానికి నివాళులర్పించారు.

తాపీ ధర్మారావుకు నివాళి

తెనాలిఅర్బన్: తెలుగు మాధ్యమాల దినోత్సవాన్ని సత్యం, శివం, సుందరం సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సహజకవి అయిన డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రముఖ సాహితీవేత్త తాపీ ధర్మారావు జయంతిని తెలుగు మాధ్యమాల దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. అనంతరం ఏపీడబ్ల్యూయూజే జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పర సుధాకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది పొన్నం విజయ్‌కుమార్, ఈఎల్‌వీ అప్పారావు, పీపీ అవధాని, లక్కరాజు లక్ష్మణరావు, భీమేశ్వరప్రసాద్, డాక్టర్ తన్నీరు కళ్యాణ్‌కుమార్, అడపా సంపత్‌రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఇద్దరికి స్వర్ణ పతకాలు



పతకాలు సాధించిన వారితో రామారావు, సాంబశివరావు తదితరులు

తెనాలిఅర్బన్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తెనాలి కేఎస్ఆర్ తైక్వాండో అకాడమి క్రీడాకారులకు రెండు బంగారు, ఒక కాంస్య పతకం లభించినట్లు కోచ్ కె.శ్రీనివాసరావు తెలిపారు. పోటీలు రేపల్లెలో ఈ నెల 16,17 తేదీల్లో నిర్వహించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన జి.ప్రభురాజ్, వి.నాగసతీష్, స్నేహలతలను మంగళవారం తెనాలిలోని అకాడమీ ఆవరణలో అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అచ్యుత, సాంబశివరావు, కొత్త రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు బీపీ డిజిటల్ ఆపరేటర్స్ అందజేత

- ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులు రూ.2.50 లక్షలు ఖర్చు
- ఆర్కేకి డీఎంహెచ్‌ఓ శ్రావణ్‌బాబు అభినందనలు



ఏఎన్‌ఎంలకు బీపీ డిజిటల్ ఆపరేటర్స్‌ను అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ ఎ శ్రావణ్‌బాబు

మంగళగిరి: పేదలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చేస్తున్న కృషి అభినందనీయమని డీఎంహెచ్‌ఓ ఎ శ్రావణ్‌బాబు అన్నారు. ఎమ్మెల్యే ఆర్కే తన సొంత నిధులు రూ.2.50 లక్షలతో కొనుగోలు చేసిన 100 బీపీ డిజిటల్ ఆపరేటర్స్‌ను నగరంలోని 12 యూపీహెచ్‌సీలకు మంగళవారం డీఎంహెచ్‌ఓ శ్రావణ్‌బాబు ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులకు అందజేశారు. గణపతినగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దడంలో ఎమ్మెల్యే ఆర్కే చేసిన కృషి అభినందనీయమన్నారు. ఇటీవల నగర పాలక సంస్థ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై జరిగిన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి బీపీ డిజిటల్ ఆపరేటర్స్ కొరత ఉందని తీసుకురావడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే తన సొంత నిధులు వెచ్చించి అందజేశారన్నారు. నగరంలోని 12 యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ సెంటర్లలోగల 85 మంది ఏఎన్‌ఎంలకు బీపీ డిజిటల్ ఆపరేటర్స్‌ను అందజేశామన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ సీహెచ్ రత్నమన్మోహన్, హెల్త్ సెంటర్ మెడికల్ అధికారులు డాక్టర్లు పి అనూష, పి రమేష్, కిరణ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎ శ్రీమన్నారాయణ, ఏఎన్‌ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఇళ్లను తొలగించడం అన్యాయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అజయ్‌కుమార్

తాడేపల్లిరూరల్: తాడేపల్లిలోని మదర్‌థెరిసా కాలనీ, అమరారెడ్డినగర్ కాలనీల్లో ఇరిగేషన్ భూముల్లో 40 ఏళ్లుగా నివాసముంటున్న వారికి ఆ శాఖ నోటీసులు ఇచ్చి ఇళ్లను తొలగిస్తామనడం అన్యాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. ఆయా కాలనీల్లో ఆయన మంగళవారం పర్యటించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నివాసముంటున్న పేద ప్రజలకు నోటీసులు ఇవ్వడం అన్యాయమని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించిన వారిని న్యాయం చేయాలని అన్నారు. కాలువకట్ట నివాసితులు 5వ వార్డు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ అడ్మిన్‌కు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టి కరుణాకరరావు, గాదె సుబ్బారెడ్డి, పి.గిరిజ, డోగిపర్తి యోహాన్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, తాడేపల్లి మండల కార్యదర్శి ముసునూరు సుహాస్, సీపీఐ మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, మునగాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడిపై సీసాలతో దాడి

తెనాలిరూరల్: హత్య కేసులో నిందితుడిపై ముగ్గురు యువకులు బీరు సీసాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వివరాలు... స్థానిక చెంచుపేట ఓవర్ బ్రిడ్జి డౌన్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో సోమవారం సాయంత్రం గండికోట సాంబశివరావు అలియాస్ సాంబపై కొందరు యువకులు బీరు సీసాలతో దాడి చేశారు. గతంలో చెంచుపేటలో జరిగిన రౌడీ షీటర్ మత్తే ప్రశాంత్ హత్య కేసులో సాంబ ఏ2 నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసులో అరెస్టై ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. వినాయక చవితి పండుగ కావడంతో తెనాలిలో ఉన్న తన సోదరుడిని చూసేందుకని సాంబ పట్టణానికి వచ్చాడు. మధ్యాహ్నం బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం తాగుతుండగా ముగ్గురు యువకులు వచ్చి అతడిపై బీరు సీసాలతో దాడి చేశారు. సాంబ తల, ముఖంపై విచక్షణారహితంగా దాడి చేయడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు తీసుకు వెళ్లారు. దాడికి పాల్పడింది గతంలో హత్యకు గురైన మత్తే ప్రశాంత్ స్నేహితులు శ్రీకాంత్, నాగరాజు, మనోహర్‌గా గుర్తించారు. స్నేహితుడి హత్యకు ప్రతీకారంగానే సాంబశివరావుపై హత్యాయత్నం చేపినట్టు తెలుస్తోంది. ముగ్గురు నిందితులు ప్రస్తుతం త్రీ టౌన్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

27న తెనాలిలో డాక్ అదాలత్


తెనాలి: ఈనెల 27వ తేదీ డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ ప్రసూనారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ రీజినల్ ఆఫీస్, విజయవాడ వారి ఉత్తర్వుల ప్రకారం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. తపాల సేవలు పొందటంలో ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఆ రోజున సాయంత్రం 4 గంటల వరకు ఫిర్యాదు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీలోగా తమ ఫిర్యాదులను లెటరు ద్వారా తెనాలి కొత్తపేటలోని తమ కార్యాలయానికి పంపాలని కోరారు. కవరుపై డాక్ అదాలత్ అని రాసి పంపించాలని వివరించారు.

వాడవాడలా గణనాథుని వేడుకలు

- ఆకట్టుకుంటున్న వినాయక విగ్రహాలు
- విద్యుత్ వెలుగుల్లో పందిళ్లు
- సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు
- పలుచోట్ల అన్నదానాలు



తాడికొండ బస్టాండ్ కూడలి వద్ద గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు




పాత మంగళగిరి సీతారామకోవెల వద్ద ఏర్పాటు వినాయక విగ్రహం



తాడేపల్లి కృష్ణుడి దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం వద్ద పూజలు



దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులో అన్నదానం చేస్తున్న ఎంపీపీ



వినాయక పందిళ్ల వద్ద విద్యుత్ కాంతులు



రేపూడి గ్రామంలోని గణపతి పూజల్లో పాల్గొన్న భక్తులు

మంగళగిరి: మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాలలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళగిరి పట్టణంలోనే 60కిపైగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. మంగళగిరి రూరల్, తాడేపల్లి, తాడేపల్లి రూరల్ ప్రాంతాలలో 50కిపైగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. పాతమంగళగిరిలో రకరకాల ఆకృతులు, దేవుళ్ల చిత్రపటాలతో ఏర్పాటు చేసిన భారీ విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన శ్రీ విగ్రహం, అనేక దేవుళ్ల చిత్రపటాలతో స్వర్గం మార్గం ఏర్పాటు చేసి లోపల భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో విద్యుత్ కాంతుల్లో వీనులవిందుగా ఉండడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. పందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులతో నగరంలో కాంతులు నిండుతుంది. మెయిన్‌బజార్‌లో ఏర్పాటు చేసిన భారీ విగ్రహంతో పాటు జీఆర్ స్కూలు, హుస్సేన్ కట్టలతో పాటు నగరంలోని ఏర్పాటు చేసిన పందిళ్ల వద్ద విద్యుత్ దీపాలతో వెలుగులు వీనుతుండగా సాయంత్రం వేలల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గణనాథులను దర్శించుకున్నారు.

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండల పరిధిలో వాడవాడలా సోమవారం గణపతి పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో 140 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. దుగ్గిరాల మండల పరిధిలో 45 విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి ప్రతి వినాయకుని విగ్రహం వద్ద సంప్రదాయబద్ధంగా నూతనంగా వివాహమైన వారితో పాటు పలువురు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వినాయకునికి ఇష్టమైన ఉండ్రాళ్లను ప్రసాదాలుగా ఏర్పాటు చేశారు. ప్రతి విగ్రహం వద్ద వందల సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గస్తీ నిర్వహించారు. సమయానికి మించి ఎవరూ విగ్రహాల వద్ద సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేయవద్దని సూచనలు చేశారు. పలుచోట్ల వైఎస్సార్ సీపీ నాయకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ ఎంటిఎంసి అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై..

తాడేపల్లి పట్టణ పరిధిలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై త్రిదండి చిన్నజీయర్‌స్వామి మంగళాశాసనాలతో త్రిదండి అహోబిల స్వామి విష్వక్సేన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొనగా వారందరికీ వినాయకుని చరిత్రను వివరించారు.

కంఠంరాజు కొండూరులో....

దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి విచ్చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), జమ్ముల లోకేష్, బుజ్జి, ధనుంజయ, యువసేన కింగ్స్ సభ్యులు పాల్గొన్నారు.

తాడికొండ: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని తాడికొండ, తుళ్లూరు మండలాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేసి రకరకాల అలంకరణతో గణనాథుని అలంకరించి భక్తిశ్రద్ధల నడుమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాడికొండ రెడ్ల బజారు రేడియో రూమ్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడు, రావిచెట్టు సెంటర్ లోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని మంగళవారం భారీ ఊరేగింపు నడుమ నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో తుళ్లూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి పాల్గొన్నారు. పలు గ్రామాల్లో గణనాథుడి వివిధ రూపాలలో కొలువైన విగ్రహాలను ఏర్పాటు చేయడంతో సందడి వాతావరణం నెలకొంది.

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రుల పూజలు విశేషంగా నిర్వహించారు. నవరాత్రుల్లో భాగంగా రెండోరోజు దుర్గాకాలనీలో గణాధిపతికి పండితుడు రాజేంద్రశర్మ అష్టోత్తర,సహస్రనామ పూజలు చేశారు. కొత్తపేటలోని వినాయకుడి విగ్రహానికి విశేష పూజలు చేసి పులిహోర పంచిపెట్టారు. రేపూడి గ్రామంలోని రామాలయం వద్ద గణనాథునికి విశేషపూజలు ,శ్వేతార్కాలతో అష్టోత్తర శత నామ పూజలు పండితులు డి.కృష్ణమూర్తి చేశారు. రామాలయం వద్దనున్న లంబోధరుడికి, సాలసబస్టాండు వద్దనున్న శేతార్కగణపతికి, పోలేరమ్మ గుడివద్దనున్న అభయగణపతికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు



పుష్కర ఘాట్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ శివారెడ్డి

తాడేపల్లి: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేయాలని పోలీసులు సూచించారు. మంగళవారం సాయంత్రం అడిషనల్ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి ఆధ్వర్యంలో పుష్కరఘాట్లను పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలను క్రేన్ ద్వారా కృష్ణా నదిలోకి దించి నిమజ్జనం చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని, బుధవారం నుంచి నిమజ్జన కార్యక్రమాలు జరుగుతాయని అంచనా వేస్తున్నామని, ఇప్పటికే కార్పొరేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖ వారు కృష్ణానదిలో నిమజ్జనం జరిగే ప్రాంతాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారని, నిమజ్జనం చేయడానికి వచ్చే వారు కృష్ణానది నీటి లోపలికి వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని, ప్రమాదాలను నివారించేందుకు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈలు కిషోర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.